నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
గురువారం | ఆగస్టు 29, 2024 | www.navatelangana.com

ఐకేపీ భవన నిర్మాణానికి భూమి పూజ

లక్షెట్టిపేట : ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఇచ్చిన హామీ మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు ఐకెపి భవన నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. గెలిచిన తర్వాత మొదటిసారిగా వెంకట్రావుపేటకు వచ్చిన సందర్భంగా ఐకేపీ ఉద్యోగులు భవనం అందుబాటులో లేదని ఎమ్మెల్యేకు సమస్యలు చెప్పుకున్నారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఐకేపీ భవనం మంజూరు చేశారు. ఎంపీ ఎన్నికల కోడ్ ఉండడంతో పని ప్రారంభించలేదు. ఈ సందర్భంగా ఐకెపి సంఘ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అంకతి శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోతురాజుల రాంచందర్, నాయకులు పాయిలి చిన్నయ్య, బండి రాయలింగు, కోన కిష్టయ్య పంచాయతీ కార్యదర్శి వంశీ, ఐకేపీ సభ్యులు పాల్గొన్నారు.



కేసీఆర్ కుటుంబానికి పోరాటం కొత్తేమీ కాదు

జైపూర్ : మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుటుంబానికి పోరాటం కొత్తకాదు, కేసులకు భయపడే కుటుంబం కాదని టీబీజీకేఎస్ నాయకులు కటుకూరి రత్నాకర్‌రెడ్డి అన్నారు. లిక్కర్ కేసులో తిహార్ జైలు నుండి ఎమ్మెల్సీ కవిత విడుదలైన సందర్భంగా బుధవారం ఇందారం-1ఏ గనిపై సంబరాలు జరుపుకున్నారు. కేసీఆర్ కుటుంబంపై రాజకీయ కక్షతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అక్రమంగా కేసు నమోదు చేసి జైలుకు పంపినప్పటికీ అత్యున్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడం హర్షనీయమని పేర్కొన్నారు. జైలు నుండి వచ్చిన ఎమ్మెల్సీ కవితకు ధైర్యంతో మళ్లీ ప్రజా క్షేత్రంలో అడుగు పెట్టాలని కోరుకుంటూ గని ఆవరణలోని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. గని కార్మికులతో కలిసి టపాసులు పేల్చి కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్గు తిరుపతి, దాస రవి, కృష్ణ, కె.తిరుపతి, గోపాల్, జాడి శంకరయ్య, శేఖర్, ప్రవీణ్‌రావు, సతీష్ పాల్గొన్నారు.



ఇక్కడా కావాలి ఓ హైడ్రా..!

- అనేక చోట్ల చెరువులు,కుంటలు అన్యాక్రాంతం
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లు అక్రమించి కట్టడాలు
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే అనేక ఫిర్యాదులు
- ఇక్కడా ఏర్పాటుచేయాలని జిల్లావాసుల డిమాండ్

అక్రమ కట్టడాల కూల్చివేతతో ప్రకంపనలు సృషిస్తున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటక్షన్(హైడ్రా)పై అందరి దృష్టి కేంద్రీకృతమవుతోంది. రోజూ ఈ సంస్థ చేపడుతున్న చర్యలపై దృష్టిసారిస్తున్న జనం..ఇలాంటి సంస్థ మన జిల్లాలోనూ నెలకొల్పితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంస్థను ఏర్పాటుచేయాలని ఇప్పటికే కొందరు అధికార పార్టీకి చెందిన నేతలు సీఎంకు విజ్ఞప్తి చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. చెరువులు, కుంటలు కబ్జాకు గురికావడం ఒక్క హైదరాబాదుకు మాత్రమే పరిమితం కాలేదని..అలాంటి ఘటనలు జిల్లాల్లోనూ కొకొల్లలుగా ఉన్నాయని సామాన్య జనం సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయా జిల్లాల పేరుతో ఈ సంస్థలను ఏర్పాటుచేస్తే బాగుంటుందనే భావన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ సంస్థ హైదరాబాదులో చేపడుతున్న కార్యకలాపాలను ఆసక్తిగా తెలుసుకుంటున్న జనం ఇక్కడా ఓ హైడ్రా వంటి సంస్థ కావాలని కోరుతుండటం చర్చనీయాంశంగా మారింది.



మంచిర్యాలలో చెరువును ఆనుకొని నిర్మాణాలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజలు, పశవులతో పాటు పంట పొలాలకు సాగునీరందించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వాలు నివాసాల మధ్యలో చెరువులు, కుంటలను ఏర్పాటుచేసింది. మన రాష్ట్రంలో కాకతీయులు, నిజాం కాలంలో ఈ చెరువుల నిర్మాణం అధికంగా జరిగినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. గతంలో ఊరికి కనీసం మూడు చెరువులు ఉండేవని..ఒకటి తాగునీటికి, రెండోది బట్టలు ఉతకడం..మూడోది పంటల కోసం నిర్మించారని చెబుతుంటారు. ఒకప్పుడు వర్షాకాలం రాగానే ఈ చెరువులు, కుంటలు నిండుకుండలా మారి ఎండకాలం చివరి వరకు ప్రజలకు ఉపయోగపడేవి. కానీ కాలానుగుణంగా వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో కబ్జాకు గురవుతూ వచ్చాయి. ముఖ్యంగా పట్టణాల్లో జన సాంద్రత పెరగడంతో ఇండ్లు, ఇతరాత్ర వాటిని చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఫుల్‌లెవల్‌ట్యాంక్(ఎఫ్‌టీఎల్) పరిధితో పాటు చెరువుకు ఆయకట్టుకు మధ్యలో ఉండే బఫర్‌జోన్‌లను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు ఆరోపణలున్నాయి. వీటిపై స్థానికుల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినా అధికారులు, పాలకులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రస్తుతం ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లా కేంద్రాలతో పాటు ముఖ్య పట్టణాలు, మండల కేంద్రాల్లో అనేక చెరువులు, కుంటలు ఆనవాళ్లు లేకుండా పోయినట్లు ఆరోపణలున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్‌జోన్‌లలో నిర్మాణాలు చేయకూడదనే నిబంధనలు ఉన్నా కొందరు అధికారుల అండగా అక్రమార్కులు వాటిని కబ్జా చేసి ఇతరులకు విక్రయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వాటిలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇండ్లు కట్టుకున్నట్లు తెలుస్తోంది. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతున్నా..ఇన్నాండ్లు అధికార యంత్రాంగం దృష్టిసారించిన దాఖలాలు లేకుండా పోయాయి. దీంతో ఆయా జిల్లా కేంద్రాల్లోని చెరువుల ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్‌జోన్‌లోనూ అనేక నివాసాలు, ఫామ్‌హౌస్‌లు, ఆస్పత్రులు, వివిధ రకాల నిర్మాణాలు వెలిసినట్లు తెలుస్తోంది. చెరువులకు సంబంధించిన భూములను సైతం అధికారులతో లోపాయికారి ఒప్పందం మేరకు కొందరు అక్రమంగా పట్టాలు చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఇక్కడ ఏర్పాటు చేయాలని డిమాండ్..!

ఉమ్మడి జిల్లాలోనూ అనేక చెరువులు, కుంటలతో పాటు విలువైన ప్రభుత్వ స్థలాలు సైతం అన్యాక్రాంతమవుతున్నాయి. అక్రమార్కుల చెరబట్టడంతో కబ్జాకు గురవుతున్నాయి. రియల్‌ఎస్టేట్ పెరిగిన తర్వాత ఈ సమస్య మరింత అధికంగా మారిందని జనం చెబుతున్నారు. ఒకప్పుడు విశాలంగా ఉన్న చెరువులన్ని కాలానుగుణంగా కబ్జాకు గురవుతుండటంతో ఏండ్ల నుంచి పట్టణాలు, మండల కేంద్రాల్లో నివాసముంటున్న జనాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో అధిక వర్షాలు కురిసిన సమయంలో ఇండ్లు నీటిలో మునిగిపోవడం వంటి విపత్కర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం హైడ్రా పేరిట హైదరాబాదులో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతుండటంతో ఇలాంటి సంస్థను అన్ని జిల్లాల్లో ఏర్పాటుచేయాలని జనం డిమాండ్ చేస్తున్నారు. హైడ్రా వంటి సంస్థ జిల్లాల్లో ఉంటే కనీసం భవిష్యత్తులోనైనా చెరువులు, కుంటలు, ఇతర ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా ఉంటాయని జనం విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఉమ్మడి జిల్లాలోని కొందరు అధికార పార్టీకి చెందిన నేతలు సైతం ఈ సంస్థను ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజల నుంచి సైతం ఈ డిమాండ్ తెరమీదకు రావడం ఆసక్తికరంగా మారింది.

నేడు భీంరావు వర్ధంతి వేడుకలు విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 29న నిర్వహించే ఉమ్మడి రాష్ట్ర మొట్టమొదటి గిరిజన శాఖ మంత్రి కొట్నాక భీంరావు వర్ధంతి వేడుకలు విజయవంతం చేయాలని రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా ఉపాధ్యక్షుడు సిడాం సూరు మాస్టర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాయి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1962లో మొదటిసారిగా ఆసిఫాబాద్ నియోజవర్గం నుండి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొంది, అనంతరం పలు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పీవీ నరసింహారావు ముఖ్యమంత్రి హయాంలో 1972లో గిరిజన శాఖ మంత్రిగా పని చేశారని గుర్తు చేశారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగుదామన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కొట్నాక్ భీంరావు పిల్లల ఉద్యానవనంలో ఉదయం 11.30కు నిర్వహించే వర్ధంతి వేడుకల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రాయి సెంటర్ అడ్వైజర్ కొట్నాక కిషన్‌రావు, రాజ్ గోండ్ సేవాసమితి కోశాధికారి కుర్మెత మారుతి, ఐటీడీఏ మాజీ చైర్మన్, గిరిజన నాయకుడు సిడాం అర్జుమాస్టర్, మండల రాయి సెంటర్ సార్మేడి జ్ఞానేశ్వర్, గోండ్వానా యువజన నాయకుడు ఆత్రం చందన్ షా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి అల్లోల పరామర్శ



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో అడెల్లి గ్రామానికి చెందిన తలారి రాజలింగం(70) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులు అంబేద్కర్ సంఘం అధ్యక్షులు నాగయ్య, ఈనాడు రిపోర్టర్ సిద్దును బుధవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వీరి వెంట అల్లోల మురళీధర్‌రెడ్డి, ఐర నారాయణరెడ్డి, మహిపాల్‌రెడ్డి, మాధవ్‌రావు, రాజేశ్వర్‌రావు, పురుషోత్తంరావు, రాంచందర్, లక్ష్మీనారాయణ, సాయికృష్ణ ఉన్నారు.

నేతకాని సంఘం చింతగూడ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ గ్రామ నేతకాని కుల సంఘం గ్రామ కమిటీని బుధవారం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాళ్లపల్లి రాజేశ్వర్, జిల్లా నాయకులు జాడి గంగాధర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా దుర్గం నందయ్య, అధ్యక్షులుగా దుర్గం వినోద్ కుమార్, ఉపాధ్యక్షులుగా జాడి రాజన్న, దుర్గం రాజు, ప్రధాన కార్యదర్శి అల్లూరి వినోద్, కోశాధికారిగా మునేసుల శంకర్, సంయుక్త కార్యదర్శిగా జాడి దేవేందర్, ప్రచార కార్యదర్శిగా జాడి రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రామటెంకి చంద్రయ్య, కిష్టయ్య, దుర్గం లింగం, జాడి రాజన్న, దుర్గం శ్రీనివాస్, సలహాదారులుగా దుర్గం లక్ష్మణ్, జాడి రాజన్న, రాజలింగు, రాజయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వచ్చే నెల 1న మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తామని, దీనికి నేతకాని కులస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి : ఎస్పీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వినాయక చవితి పండుగను పురస్కరించుకొని జిల్లాలో గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించడం, మండపాలు ఏర్పాటు చేయదలచిన వారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవడం తప్పనిసరని ఎస్పీ డివి శ్రీనివాసరావు తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు గణేష్ నవరాత్రిని భక్తి, శాంతితో జరుపుకోవాలని, ఎటువంటి అల్లర్లు జరగకుండా చూడాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల ముసుగులో అసభ్యకరమైన, అనైతిక ప్రదర్శనలు, రికార్డు డాన్సులు నిర్వహిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గణేష్ ఉత్సవ సమితులు నవరాత్రి సందర్భంగా జరిగే అన్ని కార్యకలాపాలకు పూర్తి బాధ్యత వహించాలన్నారు. పోలీసులు సూచించిన నిబంధనలు ఉత్సవ సమితి సభ్యులు పాటించాలన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-బోథ్



వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సివిల్ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి రోగులతో మాట్లాడి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో జిల్లా ఇన్చార్జి మంత్రి చేతుల మీదుగా ప్రారంభం కానున్న నూతన సబ్ రిజిస్టర్ కార్యాలయ ప్రారంభోత్సవానికి సంబందించిన అన్ని ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అక్కడ పిల్లలకు భోజన వసతి, పిల్లలకు బోధిస్తున్న తీరు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి అక్కడ కావాల్సిన వసతుల గురించి తెలుసుకున్నారు. కావాల్సిన సౌకర్యాలు కల్పించడానికి సహకరిస్తామని కలెక్టర్ చెప్పారు. బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినికి డెంగ్యూ వచ్చిందని, ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఇన్చార్జి ఎంపీడీవో జీవన్‌రెడ్డి, తహసీల్దార్ సుభాష్ చందర్, ఆసుపత్రి సుపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రప్రసాద్, ఎస్‌వో వలిత పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతి ఆటో వాహన చోదకుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పట్టణ సీఐ సతీష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని, లైసెన్స్ లేకుండా, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపవద్దని, నడిపితే చీటింగ్ కేసులు పెడతామని పేర్కొన్నారు. ప్రతి ఒక్క ఆటోకు సంబదించిన ఓనర్ డ్రైవర్ యొక్క వివరాలు తప్పనిసరిగా 'అభయ యాప్'లో పొందుపరచాలన్నారు. అపరిచితులు కనిపిస్తే డయల్ 100కు కానీ, పోలీస్‌స్టేషన్‌కుకానీ సమాచారం ఇవ్వాలని అన్నారు. నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేశ్వర్, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గణేష్ మండపాలు నిబంధనలు పాటించాలి

పట్టణ పరిధిలో ఏర్పాటు చేయనున్న గణేష్ మండప నిర్వాహకులు పోలీసు నిబంధనలు పాటించాలని సతీష్ తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసే గణేష్ మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండప నిర్వాహకులు తమ వినాయకుని వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. పోలీసులు సూచించిన పది నియమాలను పాటిస్తూ కార్యక్రమాలు నిర్వహించుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కాకుండా చూడాల్సిన బాధ్యత మండప నిర్వాహకులపై ఉంటుందని పేర్కొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి : కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా అన్ని విద్యాసంస్థలు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తో కలిసి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులతో విద్యా ప్రమాణాలు పెంపొందించడంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తూ విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు కృషి చేయాలని అన్నారు. యుడైస్ 2024-25 విద్యా సంవత్సరంలో నైతిక విలువలతో విద్యా బోధనలు చేస్తూ విద్య ప్రమాణాలను మెరుగుపరిచి జిల్లాను మంచి స్థానంలో ఉంచేలా అందరూ సమిష్టిగా పనిచేయాలని తెలిపారు. పాఠశాలల భద్రతపై చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను కనీస మౌలిక వసతులు కల్పించాలని, ప్రతి అంశంలోని వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు సుమారుగా 1200 ఉన్నాయని, అన్ని విద్యాసంస్థల పూర్తి వివరాలతో నివేదిక రూపొందించి అందించాలని అధికారులను ఆదేశించారు. స్కూల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్రణాళికలో భాగంగా విద్యాసంస్థల భవనాల నాణ్యత వివరాలు, అన్ని పాఠశాలలు, కళాశాలలలో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకుల వివరాలు ఫోటోలతో కూడిన ఫ్లెక్సీలను ఆయా పాఠశాలలలో ప్రదర్శించాలని, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలలో విద్యను అభ్యసించే విద్యార్థుల వివరాలను నమోదు చేయాలని తెలిపారు.

గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-జైపూర్

ఇందారం-1ఏ గనితో పాటు ఓపెన్‌కాస్ట్ గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ డిప్యూటీ ఉప ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా కోరారు. బుధవారం ఇందారం-1ఏ, ఓపెన్‌కాస్ట్ గనులను సందర్శించిన నాయకులు కార్మికుల సమస్యలను డిపార్ట్‌మెంట్ల వారీగా అడిగి తెలుసుకున్నారు. అండర్ గ్రౌండ్ గనిలో భర్తీ, ఖాళీ సప్లై లైన్లు సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుండగా యాజమాన్యం చార్జీ షీట్లు ఇస్తున్నట్లు తెలుసుకున్నారు. టేల్ రూఫ్ లాగటానికి ఒక కార్మికున్ని అదనంగా ఇవ్వాల్సి ఉంటుందని, ఐకే ఓపెన్‌కాస్ట్ గనిలో గ్రీజర్ హెల్పర్‌గా పని చేస్తున్న వారికి యాక్టింగ్ రావడం లేదని తెలుసుకున్నారు. అదేవిధంగా ఈపీ ఆపరేటర్స్ లోడర్స్ నడిపినప్పుడు యాక్టింగ్ గ్రేడ్ ఇవ్వాలని కార్మికులకు రెస్ట్ షెల్టర్, భోజనశాలలు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ షెడ్లు నిర్మించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.



కార్మికుల సౌకర్యార్థం అందుబాటులో టాయిలెట్స్ ఏర్పాటు తదితర విషయాలపై గని ఉన్నతాధికారులతో జరిపిన చర్చలతో సానుకూలంగా స్పందించారని తెలిపారు. వీలైనంత త్వరగా కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని గని అధికారులు హామీ ఇచ్చినట్లు ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గని పిట్ కార్యదర్శి చింతల నవీన్‌రెడ్డి, అగ్గు శ్రీకాంత్, మైనింగ్ స్టాఫ్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు బాలకృష్ణ, కాంట్రాక్ట్ వర్కర్స్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, ట్రేడ్స్‌మెన్ నాయకులు సురేష్, పిట్ సహాయ కార్యదర్శి దరిని దేవేందర్, వెంకటేష్, సురేష్, మనోహర్, ఈశ్వర్, రమేష్, రాజకుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కృష్ణ, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీధర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వ ఉన్నట్లైతే దోమలు ఎక్కువవుతాయని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉంటాయని, వాటిపై తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ లత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, సబ్ యూనిట్ ఆఫీసర్ రవీందర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అనిత, సూపర్వైజర్ దేవిదాస్ పాల్గొన్నారు.

సీపీఆర్ చేసి బాబుని బతికించిన 108 సిబ్బంది

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన సుద్దాల శైలజ బుధవారం పురిటి నొప్పులతో బాధపడుతూ 108 సిబ్బందికి ఫోన్ చేశారు. సిబ్బంది ఇంటికి వచ్చేసరికి ఆ మహిళ మగ శిశువుకు జన్మనిచ్చింది. ఆ శిశువుకు ఊపిరి లేకపోవడంతో 108 సిబ్బంది జాడి రమేష్, సంపత్, సీపీఆర్ చేసి బాబును బతికించారు. మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో తల్లీ బిడ్డలను లక్షెట్టిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు.

రోగులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-ముధోల్

నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ జన్మదిన సందర్భంగా బుధవారం రోగులకు బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. స్థానిక కంటి దవాఖానాలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు ఎమ్మెల్యే ముధోల్ అభివృద్ధి కి నిరంతరం కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, నాయకులు బొల్లం నర్సాగౌడ్, పట్టెపురం సతీష్‌రెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, సప్పటోల్ల పోతన్న, లక్ష్మి నారాయణ, నర్సారెడ్డి, తాటివార్ రమేష్, విఠల్‌రావ్, సంతోష్, మోహన్ యాదవ్, కాసారం శ్రీకాంత్ పాల్గొన్నారు.



గంబూషియా చేప పిల్లల విడుదల

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం దస్నాపూర్ సబ్‌సెంటర్ ఏరియాలోని పద్మావతి కాలనీ, శంకర్‌గుట్ట కాలనీలో నిల్వ ఉన్న నీటిలో లార్వాలను గుర్తించి, గుంతల్లోని నీటిలో గంబూషియా చేపపిల్లలను వేశామన్నారు. దీంతో దోమల లార్వా నివారణ ద్వారా డెంగ్యూ, జ్వరాలు అరికట్టవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డా.కృష్ణ, జిల్లా మలేరియాధికారి డా.శ్రీధర్ ఆదేశాలతో అంకొలి డాక్టర్ డా.సర్ఫరాజ్ సిబ్బంది. హెల్త్‌సూపర్ వైజర్ బొమ్మెత సుభాష్, నల్ల ఈశ్వర్‌రెడ్డి, మలేరియా సిబ్బంది అనిల్, ఉదయ్, బాలాజీ, కార్తీక్‌గౌడ్ కాలనీవాసులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీని సందర్శిన ఐసీఎంఆర్ కేంద్ర బృందం



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం ఐసీఎంఆర్ కేంద్ర బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందిస్తున్న వివిధ వైద్య సేవలపై ఆరా తీశారు. నవజాత శిశుమరణాల కట్టడికి అన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐసీఎంఆర్ కేంద్ర బృందం డాక్టర్ ఆష్లిన్ శుక్లా వైద్యులకు, వైద్య సిబ్బందికి సూచించారు. నవజాత శిశుమరణాల అధ్యయనంలో భాగంగా కాన్పుల విభాగం కంగారూ మదర్ కేర్ యూనిట్లను పరిశీలించారు. పరిశీలించిన వారిలో కేంద్ర రాష్ట్ర బృందం సభ్యులు డాక్టర్లు ధనిగైనాథన్, మనోజ్, మోహన సుందరి, సత్యసాయి ప్రసాద్, అంజలి, పీహెచ్‌సీ వైద్యులు రాంబాబు, జితేందర్‌రెడ్డి, ప్రవీణ్ వైద్యుడు, డాక్టర్ రాంబాబు, జితేంద్రారెడ్డి, ప్రవీణ్, సీహెచ్‌ఓ లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు చౌహన్ చరణ్‌దాస్, సత్యవ్వ, వైద్య సిబ్బంది విలాస్ ఉన్నారు.

శ్రీచైతన్య విద్యాసంస్థల అవినీతిపై విచారణ జరిపించాలి



నవతెలంగాణ-నిర్మల్

శ్రీచైతన్య విద్యాసంస్థల అవినీతిపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సింగారి వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శ్రీచైతన్య స్కూల్ ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. శ్రీచైతన్య విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తూ, కనీస మౌలిక వసతులు కల్పించకుండా, నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని అన్నారు. ర్యాంకుల కోసం మార్కుల కోసం విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఎలాంటి పర్మిషన్ లేకుండా రెండు బ్రాంచ్‌లతో నడుపుతున్నారని, విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేసిన, తప్పుడు డాక్యుమెంట్స్‌తో అనుమతులు పొందారని ఫిర్యాదు చేసిన విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన టాక్స్‌లపై విచారణ చేపట్టాలని, 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ నిలిపివేస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీ చైతన్యపై చర్యలు తీసుకోకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, రాజు, రవి, మహమ్మద్ ఆలీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

పశువధశాలకు స్థలాన్ని కేటాయించొద్దు



నవతెలంగాణ-సారంగాపూర్

నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని పశువధశాలను సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపానికి తరలించొద్దని బుధవారం గ్రామస్తులు తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని పశు వధశాలను మా గ్రామ పరిధిలో కేటాయించొద్దని గ్రామ సమీపంలో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, బీసీ గురుకుల డిగ్రీ కళాశాల, కోతుల సంరక్షణ కేంద్రం, గండి రామన్న పార్క్, ఆరేల్లి మైసమ్మ మందిరం, విత్తన శుద్ధి కేంద్రం, ఆర్టీఓ కార్యాలయం, దళితులకు చెందిన వారి పచ్చని పొలాలు ఉన్నాయని అన్నారు. వీటిని పరిగణలోకి తీసుకొని పశువధశాలను ఇక్కడికి తీసుకురావద్దని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చించోలి(బి) గ్రామస్తులతో పాటు రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా అధ్యక్షులు వెంకటరాంరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు రాంశంకర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షులు కరిపే విలాస్, కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య, మండల సీనియర్ నాయకులు చంద్ర ప్రకాష్‌గౌడ్, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సాహెబ్‌రావు, వెంకట రమణరెడ్డి, దశరథ రాజేశ్వర్‌లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నేరడిగొండ



మండల కేంద్రంలో ఎమ్మెల్యే నివాసంలో బుధవారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల కన్వీనర్ శివారెడ్డి పంపిణీ చేశారు. మండలానికి చెందిన ఎం.చంద్రయ్య షుగర్‌వ్యాధితో బాధపడుతూ కొద్ది రోజుల కింద కాలుని తీసేశారు. ఆయన వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధి కింద మంజూరైనా రూ.39వేలు, అదేవిధంగా కుంటాల గ్రామానికి చెందిన వై.లక్ష్మికి రూ.21వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు కాగా వాటిని పంపిణీ చేశారు. అనంతరం లబ్దిదారులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కి ధన్యవాదాలు తెలిపారు. వీరితో పాటు వైస్ ఎంపీపీ ఏలేటి మహేందర్‌రెడ్డి, వీడీసీ చైర్మెన్ రవీందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పండరి, స్థానిక ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి, సురేందర్ రాథోడ్ ఉన్నారు.

అమరుల పోరాట ఫలితమే నేటి ఉచిత విద్యుత్

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్
- విద్యుత్ అమరులకు నివాళి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభను బుధవారం స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ విద్యుత్ అమరవీరులకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటం నాటి ప్రపంచ బ్యాంకుకు ఏజెంట్‌గా పనిచేసిన చంద్రబాబు ప్రభుత్వాన్ని కూల్చిందని అన్నారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రయివేటీ కరణ చేసే భాగంలో విపరీతమైన చార్జీలను పెంచిందని అన్నారు. భరించలేని ప్రజలు తిరుగుబాటు చేశారని అన్నారు. 2000 సంవత్సరం ఆగస్టు 28న ఛలో అసెంబ్లీ నిర్వహించిన ర్యాలీపై పోలీసులు తుపాకీ గుండ్ల వర్షం కురిపించారని అన్నారు. నీటి ఫిరంగులు, లాఠీ చార్జీ చేయగా అందులో వేలాది మందికీ గాయాలు కాగా, సీపీఐ(ఎం) నాయకులు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్త బాలస్వామి నేలకొరిగారని అన్నారు. ఆనాటి పోరాట ఫలితంగానే తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ ను తీసుకువచ్చిందన్నారు. తర్వాత కాలంలో వచ్చిన ఏ ప్రభుత్వం అయినా దాన్ని కొనసాగిస్తూ వచ్చిందని, నేడు రైతులకు, వృత్తిదారులకు, గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అమలు అవుతుందంటే నాటి పోరాట ఫలితమే అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు తిరుగుబాటు చేస్తే ఎంతటి ఫలితాలు సాదించవచ్చో నాటి విద్యుత్ పోరాటం రుజువు చేసిందన్నారు. విద్యుత్ పోరాట అమరుల స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, నాయకులు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, చిల్లా సుజాత, ప్రశాంత్ పాల్గొన్నారు.

వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచి అమలు చేయాలి

- ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి అరిఫా బేగం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వికలాంగుల పెన్షన్ ప్రభుత్వం రూ.6 వేలకు పెంచి అమలు చేయాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి అరిఫా బేగం అన్నారు. బుధవారం ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఆసరా పెన్షన్స్ పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని అన్నారు. పెన్షన్లకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.300 నుంచి రూ.3వేలకు పెంచాలని అన్నారు. పెన్షన్‌కు కేంద్ర ప్రభుత్వం వాటా 2011 నుంచి కేవలం రూ.300 ఇస్తుందని అన్నారు. దీంతో ఎట్లా బతికేదని అన్నారు. నిత్యావసర సరకుల ధరలు గడిచిన 13ఏండ్ల కాలంలో 300 రేట్లు పెరిగాయన్నారు. ధరల పెరుగుదల సూచికి అనుగుణంగా పెన్షన్స్ పెంచాలన్నారు. సాబ్ కా సాత్ సాబ్ కా వికాస్ అంటున్న కేంద్ర ప్రభుత్వం పెన్షన్స్ ఎందుకు పెంచడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పెన్షన్ వాటా పెంచకుండా వికలాంగుల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వికలాంగుల పెన్షన్ రూ.6వేలు, వృద్ధులు, వితంతువులతో పాటు ఇతర పెన్షన్స్ రూ.4వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి 8నెలలు గడుస్తుందన్నారు. కానీ పెన్షన్స్ పెంపు గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం నిర్ణయం కోసం 44,49,767 మంది ఆసరా లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని అన్నారు. 2024 జనవరి నుండే పెంచిన పెన్షన్స్ అమలు చేస్తామని, అధికారంలోకి రాకముందే హామీ ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన వికలాంగులకు ఉచిత బస్ ప్రయాణం, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం అమలు వంటి వాటిని వెంటనే అమలు చేసే, విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాలపరిమితి ముగిసిన సదరం సర్టిఫికెట్స్ వెంటనే రెన్యూవల్ చేయాలన్నారు. వేలాది మంది సదరం సర్టిఫికెట్లపై డాక్టర్స్ సంతకాలు లేకపోవడం వలన ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. ప్రస్తుతం క్యాంపు నిర్వహిస్తున్న డాక్టర్స్ సంతకాలు పెట్టె విధంగా ఉత్తర్వులు ఇవ్వాన్నారు. 14రకాల వైకల్యాలకు సదరం సర్టిఫికెట్స్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తలసేమియా, సికిల్‌సెల్, హేమోఫీలియా, ఆటీజం, కండరాల క్షీణత, న్యూరోలాజికల్ డిజార్డర్స్ వంటి వైకల్యాలు కలిగిన వారికి నేటికీ కూడా ప్రత్యేకంగా సదరం సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యలన్నింటి పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు రాష్ట్రవ్యాప్తంగా చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు మెస్రం నగేష్, జిల్లా ఉపాధ్యక్షులు, పొచ్చన్న, అనసూయ, జిల్లా సహాయ కార్యదర్శులు దత్తు, చిత్రుఘన్, మాసరఫ్ బేగం, నాయకులు భరత్ బాయ్, పద్మ పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమతో ఇబ్బందుల్లేకుండా చర్యలు



నవతెలంగాణ-నిర్మల్

ఇథనాల్ పరిశ్రమతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల రైతులు, విద్యావంతులు, ప్రజలు, పరిశ్రమ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమపై రైతులు, గ్రామస్తుల సందేహాలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, నీటిపారుదల, అటవీ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఇటీవల ఆందోళన చేసిన వారి వాహనాలు జప్తు చేయడంతో పాటు, పలువురి పై కేసులు నమోదు చేశారని, గ్రామస్తులు కలెక్టర్ కు విన్నవించారు. పోలీస్‌శాఖ అధికారులతో చర్చించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని, ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారు. పరిశ్రమపై మహిళలు, రైతులు, విద్యావంతులు, యువత సందేహాలను, ప్రశ్నలను లిఖిత పూర్వకంగా తహసీల్దార్ స్వాతికి అందించాలని సూచించారు. సందేహాలను శాస్త్రీయంగా పరిశీలించి, తదుపరి సమావేశంలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డివిజనల్ అటవీశాఖ అధికారి షేక్ ఆదాం నాగిని భాను, డీఆర్వో భుజంగ్‌రావ్, డీపీఓ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, డీఎంహెచ్‌ఓ రాజేందర్, దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్తులు, రైతులు, విద్యావంతులు, యువత, కాలుష్య నియంత్రణ అధికారులు, ఇథనాల్ పరిశ్రమ ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెంటపర్తి ఊశన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జన విజ్ఞాన వేదిక ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెంటపర్తి ఊశన్నను ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా పీఆర్టీయూ తెలంగాణ, ఎస్టీటీయూ, ఫిట్ ఇండియా ఫౌండేషన్, రెగ్యులర్ వాకింగ్ టీమ్ తదితర సంఘాల నాయకులు శాలువా కప్పి, మహనీయుల పుస్తకాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సైన్స్ సర్వాంతర్యామి, సైన్స్ లేకుండా ప్రపంచాన్ని ఊహించడం కష్టమన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మనం ఉహించనంత అభివృద్ధి సాధిస్తున్నామని పేర్కొన్నారు. దీనికి ధీటుగా మూఢ విశ్వాసాలు వికృత రూపంలో శాస్త్ర, సాంకేతిక రంగాలకు గుదిబండగా మారుతుందన్నారు. ఇది దేశ పురోభివృద్ధి అవరోధాంగా మారి అడ్డు తగులుతుందని అన్నారు. ఏది వాస్తవమో, మరేది అవాస్తవమో విజ్ఞతతో ఆలోచించాలన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఆదివాసులు జిల్లా మూఢ నమ్మకాలు మరింతగా ఎక్కువ ఉంటాయి. అందువల్ల జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జనాన్ని చైతన్య పరచాలని అని వివిధ సంఘాల నాయకులు కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ర నవీన్ యాదవ్, ఫిట్ ఇండియా ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కూర పోచ్చన్న, ఎస్‌జీటీ జిల్లా అధ్యక్షులు గడుగు నరేందర్, పీఆర్టీయూ తెలంగాణ నాయకులు ముజీఫ్, సంతోష్ కూమార్, రెగ్యులర్ వాకింగ్ టీమ్ సభ్యులు మోరే వెంకటి, ఎల్మల నగేష్, రాచర్ల నారాయణ, అట్లా ఆశోక్, కృష్ణ కూమార్, మహేందర్‌రెడ్డి, మేకల మురళి, ఇస్తారి, మల్లేష్, సాయి బాబ, మెడపట్ల నర్సింగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వసతిగృహాన్ని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలో కేంద్రంలోని బీసీ వసతి గృహాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాధన సందర్శించారు. వసతి గృహంలో చదువుతున్న పదో తరగతి విద్యార్థి నాగచైతన్యకు డెంగ్యూ నిర్ధారణ కావడంతో బుధవారం వసతి గృహాన్ని సందర్శించారు. వెంటనే విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వసతి గృహ విద్యార్థులకు దురద ఉండటంతో వెంటనే వారికి వేడి నీళ్లు అందించి, స్నానాలు చేయించాలని వార్డెన్ నర్సిములుకు సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకొని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో ఉత్తీర్ణత శాతంతో పాటు రక్తహీనత ఇతరత్రా వ్యాధులు ఏమైనా ఉన్నాయని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చంద్రమ్మను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని వసతి గృహ వార్డెన్‌తో పాటు ఉపాధ్యాయులను పర్యవేక్షణ చేయాలని కోరారు. ఆమె వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు హరీశ్, డాక్టర్ అశోక్, వసతి గృహ వార్డెన్ నర్సిములు, వైద్య సిబ్బంది నివాస్, అనిల్, లీల, సుజాత, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటా



నవతెలంగాణ-ముధోల్

విద్యుద్ఘాతంతో మృతి చెందిన రైతుకూలి కుటుంబానికి అండగా ఉంటామని మోహన్‌రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మెన్ మోహన్‌రావు పటేల్ హామినిచ్చారు. ముధోల్ మండలంలోని న్యూపిప్రి గ్రామానికి చెందిన షేక్ మగ్దుమ్(45) అనే రైతు కూలి ఇటీవల గ్రామంలో ఉన్న విద్యుత్ స్తంభం సపోర్ట్ వైర్ తగిలి మృతి చెందారు. దీంతో ఈ విషయం గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోస్లే మోహన్‌రావ్ పటేల్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. షేక్ మగ్దుమ్ కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్యేశంతో మృతుని బార్య షేక్ గౌస్య బేగంకు ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ముధోల్ నియోజకవర్గంలో ప్రమాదవశాత్తు జరిగే సంఘటనలు అగ్ని ప్రమాదం, పాము కాటు, షార్ట్‌సర్క్యూట్, పిడుగుపాటు, వరద ప్రమాదాల్లో నష్టపోయిన బాధిత కుటుంబాలకు తమ ట్రస్ట్ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముధోల్ మాజీ ఎంపీపీ జాదవ్ సుభాష్ పటేల్, యువ నాయకులు కాసరి రామకృష్ణ, సంజీవ్ పటేల్, సాయిలు, పెండ్యాల లక్ష్మణ్, పీసర సాయినాథ్‌గౌడ్, మొయినోద్దీన్, హైమద్, మాధవరావు, సురేష్, ఖదీర్, ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వార్డు ఓటరు లిస్టు నమోదు



నవతెలంగాణ-నార్నూర్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో స్థానిక వార్డు ఓటరు లిస్టు నమోదు కొనసాగుతోంది. పైఅధికారుల ఆదేశానుసారం సెప్టెంబర్ 6న అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో వార్డుల వారీగా ఓటరు లిస్టు విడుదల చేస్తున్నట్టు బుధవారం ఎంపీఓ స్వప్నశీలా పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గంగాపూర్ గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులతో కలిసి వార్డుల వారీగా ఓటర్ లిస్టును పరిశీలించారు. వారి వెంట కార్యదర్శులు ముండే రమేష్, రాజన్న, స్నేహ, కంప్యూటర్ ఆపరేటర్ జంగు ఉన్నారు.

ఎఫ్‌పీసీ రైతు ఉత్పత్తిదారుల కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-పెంబి

శ్రీ వెంకట సాయి పెంబి ఉత్పత్తి కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పండించిన పంటలను రైతులు ఏవిధంగా అమ్ముకోవాలో వివరించారు, ఎఫ్‌పీసీ సొసైటీలో మహిళలు సభ్యులుగా ఉన్నందున గర్వాంగా ఉందన్నారు. వారిని శాలువాతో సన్మానించారు. ప్రథమ సంవత్సరం చదువుతున్న పుప్పాల నవిత జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ చిత్రపటాన్ని పెన్సిల్‌తో వేసి అందజేసింది. కలెక్టర్ విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఏఓ అంజిప్రసాద్, డీడీఎం నాబార్డు మ్యాక్స్ అధ్యక్షులు వీర భద్రడు, రమేశ్వర్‌రెడ్డి, పుప్పాల శంకర్, సుధాకర్‌గౌడ్, రవి, వెంకటేష్, రాజేందర్, మహేందర్ రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | ఆగస్టు 29, 2024 | www.navatelangana.com

వాగు దాటి వైద్యం

ఇంద్రవెల్లి : మండలంలోని పిట్టబొంగరం పిహెచ్‌సి వైద్య సిబ్బంది వాగు దాటి వైద్యం అందించారు. హర్కాపూర్ పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామమైన మామిడిగూడకు వెళ్లాలంటే వాగు దాటాల్సిందే. బుధవారం వైద్యురాలు పూజిత, ఏఎన్ఎం విజయ, సుందరి ఆధ్వర్యంలో వాగును దాటి ఇంటింటా ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 49 మంది ఓపిలను పరీక్షించారు. 8 మంది గర్భవతులు, బాలింతలకు అవసరమైన మందులను అందజేశారు. చిన్న పిల్లలకు వాక్సినేషన్ చేశారు. అనంతరం గ్రామంలో డ్రై డేను నిర్వహించారు. జ్వరాలు రాకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో ఆశా మైనాబాయి పాల్గొన్నారు.



డీఐఈఓ ప్రభుత్వ కళాశాల తనిఖీ

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలను డీఐఈఓ కళ్యాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని రికార్డులను పరిశీలించి అధ్యాపకులకు తగు సూచనలు చేశారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, వార్షిక పరీక్షల్లో అధిక శాతం ఉత్తీర్ణత పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాందాస్, అధ్యాపకులు చంద్రయ్య, సురేందర్‌కుమార్, సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



సమస్యలు చెబితే బెదిరిస్తున్నారు..



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సమస్యలు ఉన్నతాధికారులకు చెప్తే తిరిగి బెదిరింపులకు పాల్పడుతున్నారని నర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల తీరును వ్యతిరేకిస్తూ జిల్లా ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరానికి తమకు 35 క్యాజువల్ లీవ్స్ ఉన్నా వాటిని వాడుకోనివ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైన లీవ్ పెడితే జీతం కట్ చేస్తున్నారన్నారు. జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహించిన తర్వాత మెడికల్ కళాశాలలో అదనపు విధులు నిర్వహించాల్సి వస్తోందని, ఇదేంటని ప్రశ్నిస్తే ఉన్నతాధికారులు వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. వెంటనే తమకు సిఎల్ వినియోగించుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. కోత విధించిన వేతనాలు తిరిగి చెల్లించాలన్నారు. బయోమెట్రిక్ చెడిపోయినప్పుడు సంతకాలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో పనిచేస్తూ మరణించిన స్టాఫ్ నర్స్ రమాదేవి మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది శ్రీలక్ష్మి, ఆసియా, జీవిత, ఫర్వీన్, సౌజన్య, నస్రీన్, శైలజ, స్వర్ణలత, షఫీయుద్దీన్, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్పీ బీఈడీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్‌సిటిఈ నిబంధనలు పాటించని జిల్లా కేంద్రంలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ బీఈడి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు కళాశాలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఒకే ప్రాంగణంలో మూడు కళాశాలలు నిర్వహిస్తున్నారన్నారు. యూనివర్సిటీ అధికారులు తనిఖీ చేసి మొదటి విడతలో కళాశాలకు అడ్మిషన్ల కోసం అవకాశం కల్పించకపోవడంతో యాజమాన్యం మళ్లీ అధికారులతో కుమ్మక్కయ్యిందన్నారు. అదే ప్రాంగణంలో కొనసాగుతున్న గిరిజన కళాశాలకు ఇప్పటివరకు రెండు కోట్ల అద్దె చెల్లించడం ప్రజాధనాన్ని వృథా చేయడమే అన్నారు. వెంటనే కళాశాలపై చర్యలు తీసుకుని మహిళ గిరిజన డిగ్రీ కళాశాలకు ప్రభుత్వ భవనం నిర్మించి అక్కడికి మార్చాలని, అప్పటివరకు తాత్కాలిక ప్రభుత్వ భవనాలు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెడం టికనంద్, గొడిసెల కార్తీక్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని గిరిజన గ్రామాలైన మోవాడ్, బలాన్‌పూర్, చింతగూడలో అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యుడు వినోద్ కుమార్ నేతృత్వంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఇంటి చుట్టుపక్కల నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. 15 మంది రక్త నమూనాలు సేకరించి వారికి అవసరమైన మందులు అందించడంతో పాటు వివిధ రకాల వ్యాధిగ్రస్తులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, డాక్టర్ నజమస్, యంపిహెచ్ఎస్ సరిత, ఉత్తం, భీంరావ్, పరుశురాం, సూర్యకళ, వసంత, రాధ పాల్గొన్నారు.

యువకుడిపై ఫోక్సో కేసు నమోదు

నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణానికి చెందిన యువకుడిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ బన్సిలాల్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం మంచిర్యాలకు చెందిన యువకుడు బాలికను ప్రేమ పేరుతో నమ్మించి మాయ మాటలు చెప్పి లొంగదీసుకొని శారీరకంగా లోబర్చుకున్నాడు. ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. నిందితుడు అయిన బాల నేరస్తుడిని బుధవారం అదుపులోకి తీసుకొని ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

3న ఇసుక వేలం పాట

నవతెలంగాణ - వాంకిడి

తహసీల్దార్ కార్యాలయంలో వచ్చే నెల 3న ఇసుక వేలం పాట మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తామని తహసీల్దార్ రియాజ్ అలీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సీఎం హామీ నెరవేర్చాలి

- ఎమ్మెల్యే హరీష్‌బాబు
- ఉద్యోగుల దీక్షకు సంఘీభావం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల వరంగల్ ధర్నా నేపథ్యంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చి వెంటనే వారి సర్వీసులు రెగ్యులర్ చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. సర్వీస్ రెగ్యులర్ చేయడం ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మోహన్ అధ్యక్షతన ఉద్యోగులు చేసిన ఒక్కరోజు నిరసన దీక్షకు పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, టిఎస్‌యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఇందురావ్, టిపిఆర్టియు జిల్లా అధ్యక్షుడు తౌటం శ్యాంసుందర్‌తో కలిసి మద్దతు తెలిపారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా



ధర్నా చేస్తున్న సమయంలో 2023 సెప్టెంబర్ 13న సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని అన్నారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకొని రెగ్యులరైజ్ చేయాలన్నారు. సంఘం నాయకులు మాట్లాడుతూ రెగ్యులరైజ్ ఉత్తర్వులు విడుదల అయ్యేవరకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఛత్రపతి శివాజీ భవన్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుకారాం, కోశాధికారి నగేష్, సీఆర్పీలు మిట్ట దేవేందర్, మహేశ్వర్, సత్యనారాయణ, రాజేశ్, జిల్లా నాయకులు గేడేకర్ సంతోష్, సోను, సందీప్, రాము, సుభాష్, పిటిఐలు రమేశ్, దేవన్న, రాజేష్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ దీపక్ తివారి విస్తృత పర్యటన

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలో బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి విస్తృతంగా పర్యటించారు. శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ భవనాలను పరిశీలించారు. నూతన భవనాలు ఏర్పాటయ్యే విధంగా చూస్తామని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ భవనానికి ఆనుకొని ఉన్న అంగన్వాడి భవన నిర్మాణాన్ని పరిశీలించి విద్యార్థులు శాతం పెంచే విధంగా చూడాలన్నారు. రవీంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మందుల నిల్వలు, రిజిస్టర్లతో పాటు ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని, వ్యాధులను నియంత్రించేందుకు





అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి సీతారాం నాయక్, వైద్యుడు రాజ్‌కుమార్‌ను వివరాలు అడిగారు. సిబ్బంది కొరత ఉండడంతో వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలుపగా, సరిపడా సిబ్బంది నియామకం కొరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం బాబాపూర్ అమ్మ ఆదర్శ ప్రైమరీ పాఠశాలను తనిఖీ చేసి పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి, పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. తాగునీరు, ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో కోట ప్రసాద్, సంబంధిత అధికారులు ఉన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

నవతెలంగాణ-తాండూర్

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలగాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. బుధవారం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు తాండూర్ విద్యా భారతి హైస్కూల్‌లో యాంటీ నార్కోటిక్ అవేర్నెస్ డే నిర్వహించారు. విద్యార్థులకు గంజాయి, మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. గంజాయి, మాదకద్రవ్యాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సిగరెట్, గుట్కా, ఆల్కహాల్ వంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఉండాలని చెప్పారు. విద్యార్థి దశ నుంచే మంచి నడవడికతో సంఘంలో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. కన్న తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. శ్రద్ధగా చదువుకొని మంచి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని తెలిపారు. గ్రామంలో ఎవరైన గంజాయి అమ్మినా, పీల్చిన తమ



దృష్టికి తేవాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి మహమ్మారి నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని మార్చేందుకు ప్రతి ఒక్కరు తమ వంతుగా కృషి చేయాలని కోరారు. సిఐ కుమారస్వామి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండి విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో కమిటీలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఏసీపీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రహ్లాద్, ఎస్సై కిరణ్‌కుమార్ విద్యా భారతి కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్, ఉపాధ్యాయులు గంప శ్రీనివాస్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

డీఎస్పీ సదయ్య ఆధ్వర్యంలో టోల్ ప్లాజా వద్ద ఎస్ఐ ప్రశాంత్ పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమతులు లేకుండా కంటైనర్ వాహనంలో హైదరాబాద్‌లో విక్రయించేందుకు 14 పశువులను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా వ్యాపారం చేస్తున్న అబ్దుల్ అజీజ్, నేహాజ్ ముజాయిద్దీన్, షేక్ జావిద్‌పై కేసు నమోదు చేశారు. పట్టుకున్న పశువులను కాగజ్‌నగర్ పట్టణంలోని గోసంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సోమక్కకు సొంతింటి కల నెరవేరింది

- దాతృత్వం చాటుకున్న ఇద్దరు యువకులు



నవతెలంగాణ-దహెగాం

ఆ కుటుంబం అత్యంత పేదరికాన్ని అనుభవిస్తుంది. ఎంతంటే కనీసం ఎండ, వానకు తలదాచుకునేందుకు కూడా నిలువ నీడ లేనంతటి కటిక పేదరికం. మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రికి సమీపంలో కేవలం ప్లాస్టిక్ కవర్ కింద కాలం వెళ్లదిస్తున్నారు. అదే క్రమంలో కాస్తో కూస్తో కుటుంబానికి ఆసరాగా ఉండే భర్త సైతం గత సంవత్సరం అదే గుడిసెలో ప్రాణం కోల్పోయాడు. దీంతో బోరే సోమక్క కుటుంబం మరి దీనస్థితిలోకి వెళ్లిపోయింది అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులతో బిక్కుబిక్కు అంటూ కాలం వెళ్లదీస్తోంది. ఇది గమనించిన మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు జరుపుల సతీష్, లొనారే సునీల్ కుటుంబానికి మేలు చేయాలనుకున్నారు. సోమక్క కుటుంబానికి ఎలాగైనా సొంతింటి కల నెరవేర్చాలని సంకల్పించారు. అనుకున్నదే తడవుగా సోమక్క కుటుంబ పరిస్థితిపై సోషల్ మీడియా వేదికగా దాతలను సహకరించాలని కోరారు. దీంతో కొంతమంది దాతలు వివిధ రకాలుగా సహకరించగా పెద్ద మొత్తంలో ఇద్దరు యువకులు చిన్న వయసులోనే పెద్ద మనసు చేసుకొని సోమక్కకు సొంతింటిని నిర్మించారు. దీన్ని బుధవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య దాతలు, గ్రామస్తులతో కలిసి గృహప్రవేశం చేసి సోమక్కకు సొంతింటిని సొంతం చేశారు. ఇది చూసిన ప్రతి ఒక్కరూ శభాష్ సతీష్, శభాష్ సునీల్ అంటూ ప్రశంసలు కురిపించారు. సహకరించిన దాతలందరికీ సోమక్క కృతజ్ఞతలు తెలిపింది.

వైద్య కళాశాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, ప్రభుత్వ వైద్య కళాశాల పర్యవేక్షకులు చెన్నకేశవులుతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం వైద్యులు, సిబ్బందిని అందించేందుకు ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా సంబంధిత శాఖ అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. యువతుల వసతి గృహానికి సంబంధించి పూర్తి వసతులు కల్పించాలని, 100 మంది మహిళ విద్యార్థినులకు సరిపడా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, వసతిగృహ గదులు, మూత్రశాలలు ఇతర సదుపాయాలు కల్పించాలని గుత్తేదారును ఆదేశించారు. భవనంలోని అన్ని అంతస్తులలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఉండేలా పర్యవేక్షించాలని కళాశాల ప్రిన్సిపల్‌కు సూచించారు. విద్యార్థినుల సంరక్షణలో భాగంగా అనుమతి లేని వారు ఎవరు లోనికి రాకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్య నభ్యసించే మహిళ వైద్య విద్యార్థినులకు సరిపడా మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని తెలిపారు. వైద్య కళాశాల సంబంధించిన తరగతి గదులు, ప్రయోగశాల, ఇతర అన్ని ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

వార్డుల వారీగా ఓటరు లిస్టు సవరణ చేపట్టండి



నవతెలంగాణ-బెజ్జూర్

జిల్లాలోని పంచాయతీల వారీగా ఓటర్ లిస్ట్ సవరణ చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్ అన్నారు. బుధవారం బెజ్జూర్ మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఓటర్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలకు అధికారులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికలకు ఓటర్ లిస్టులు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశం, ఎంపీడీవో గౌరీ శంకర్, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పీఏసీఎస్ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలో గురువారం పిఎసిఎస్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్లు మాజీ జెడ్పిటిసి పాల్వాయి సుధాకర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. పిఎసిఎస్‌లో అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మండల నాయకులు వశీఖాన్, దిగంబర్, రమేష్, తాళ్ల రామయ్య, సత్యనారాయణ, మోహన్, రాజారాం పాల్గొన్నారు.



ఇంధన్‌పల్లి అడవుల్లో ట్రైనీ ఎఫ్ఆర్ఓలు



నవతెలంగాణ-జన్నారం

జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని ఇంధన్‌పల్లి అడవుల్లోని గనిశెట్టి కుంట, మైసమ్మ కుంట, బర్తన్‌పేట్ అడవులలో ఉన్న గ్రాస్ ప్లాంట్లను, అలాగే పక్షిస్థావరాలను ట్రైనీ ఎఫ్ఆర్ఓలు బుధవారం సందర్శించారు. వారికి ఇంధన్‌పల్లి ఎఫ్ఆర్ఓ ఆఫీసోద్దీన్ అడవుల సంరక్షణ, జంతు సంరక్షణపై అవగాహన కల్పించారు. శాకాహార జంతువుల కోసం పెంచే గడ్డి క్షేత్రాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హేమలత ఎఫ్ఎస్ఓలు రవి హనుమంతరావు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన ఇండ్ల రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కాంగ్రెస్ నాయకులు చుంచు నాగేష్, ముత్తి రాజన్న ఆయన కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. రాజయ్యది బీద కుటుంబం కావడంతో మానవత దృక్పథంతో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశామని వారు పేర్కొన్నారు. పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సెప్టెంబర్ 4వ తేదీ నుంచి జరుగనున్న సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీ-సేవలో స్లాట్ బుక్ చేసుకొని నిర్ణీత తేదీలలో నూతన సదరం సర్టిఫికెట్‌కు, కాలపరిమితి ముగిసిన సర్టిఫికెట్ పున:రుద్ధరణకు సకాలంలో హాజరు కావాలని తెలిపారు. సెప్టెంబర్ 4, 9, 20, 28 తేదీలలో శారీరక వికలాంగులు-ఆర్థో(65), 13, 27 తేదీలలో కంటిచూపు(40), 17, 24 తేదీలలో మూగ, చెవుడు(65), 27వ తేదీన మానసిక వికలాంగులు(65)లకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, గతంలో మీ-సేవలో స్లాట్ బుక్ చేసుకొని వెయిటింగ్ లిస్టులో ఉన్న వారి మొబైల్ నెంబర్‌కు సదరం శిబిరానికి రావలసిన తేది వివరాలు మెసేజ్ వస్తుందని, ఇట్టి మెసేజ్ వచ్చిన వారు మాత్రమే కేటాయించిన తేదీలలో సంబంధిత ధ్రువపత్రాలతో సకాలంలో హాజరు కావాలని తెలిపారు. అర్హత గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పొలాల అమావాస్య పండుగను ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-జన్నారం

పొలాల అమావాస్య పండుగను ఘనంగా నిర్వహించాలని తెలంగాణ నేతకాని మహర్ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపెల్లి గంగేష్, రాష్ట్ర నాయకులు గవ్వల శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో పొలాల అమావాస్య పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతకాని కులస్తులు అత్యంత వైభవంగా సాంస్కృతి సాంప్రదాయాలను అనుసరిస్తూ జరుపుకునే మహా పండగ అని అన్నారు. ఈ పండగను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండగగా గుర్తించాలన్నారు. సెప్టెంబర్ 2 పొలాల అమావాస్య సందర్భంగా అదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొంటారన్నారు. నేతకాని కులస్తులు కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతకాని సంఘ నాయకులు దూల వెంకటేష్, రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

సాక్షర పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-6 గనిలో గల ప్రయివేట్ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా, అర్హత లేని అధ్యాపకులతో విద్యా బోధన చేయిస్తున్న సాక్షార పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని తెలంగాణ బహుజన విద్యార్థి సమైక్య(టీబీఎస్ఎఫ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగిరి రాజేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల విద్యాధికారి(ఎంఈఓ) పోచయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల ఆవరణలో కనీస వసతులు లేవని, అనర్హులతో విద్యాబోధన చేయిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. సాయంత్రం వేళ విద్యార్థులు ప్లే గ్రౌండ్లో ఆటలాడుకుని సేద తీరడానికి పీఈటీ లేరని, పాఠశాలకు ఫైర్ పర్మిషన్ కూడా లేదని తెలిపారు. ఎంఈఓ విచారణ చేపట్టాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యాబోధన చేస్తున్న పాఠశాలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ సుధాకర్ ఒక్కరోజు కూడా స్కూల్లో ఉండకుండా అర్హత లేని వారిని ఇన్‌చార్జీలుగా రోజుకు ఒకరిని నియమిస్తూన్నారని ఆరోపించారు.

కార్మికుడి మృతికి సంతాపం

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట గనికి చెందిన సపోర్ట్ మ్యాన్ కార్మికుడు పులి మూర్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం సంతాపం తెలిపారు. కార్మికుడు పులి మూర్తి దైవ దర్శనం కోసం వేములవాడకు కుటుంబ సభ్యులతో వెళ్లి ఆటోలో ఇంటికి బెల్లంపల్లికి వస్తుండగా లక్సెట్టిపేట సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కార్మికుడి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, చిప్పరి శ్రీహరి, రాజేందర్, పి సురేష్, దామోదర్, మైన్స్, సేఫ్టీ మైన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుటుంబ నిర్ధారణ లేని రైతు వివరాల నమోదు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో పంట రుణమాఫీ పథకంలో భాగంగా కుటుంబ నిర్ధారణ చేయబడని రైతుల వివరాలను మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో వివరాలను నమోదు చేశారు. రుణమాఫీ యాప్‌లో కుటుంబం నిర్ధారణ లేని రైతుల కుటుంబాల వివరాలను సేకరించి ఆప్ నమోదు చేసినట్లు ఏఓ తెలిపారు. మండలంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు పరిధిలో 348 రైతులు, దేవాపూర్ యూనియన్ బ్యాంక్ పరిధిలో 100 మంది రైతులు కుటుంబ నిర్ధారణ లేని రైతులు ఉన్నట్లు వివరించారు.

వీఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వీఓఏలు

నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి మహిళా స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేస్తూ మహిళల ఆర్థికంగా, సామాజికంగా అవగాహన కల్పిస్తున్నారన్నారు. 20 సంవత్సరాల నుంచి గ్రామాల్లో మహిళల అభ్యున్నతికి మహిళ స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేస్తూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి వారికి అవగాహన కల్పిస్తూ చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహించి వారికి లోన్స్ ఇప్పించి తిరిగి సక్రమంగా లోన్స్ వెల్లించే విధంగా ప్రోత్సహిస్తున్నారన్నారు. డ్వాక్రా మహిళా సంఘాలు నిర్వహిస్తున్న లావాదేవీలన్నీ పుస్తక నిర్వహణ చేస్తూ ఎస్‌ఎచ్‌కే లైవ్ మీటింగ్ పెట్టి అన్ని సంఘాలు ఆన్‌లైన్ ఎంట్రీ చేస్తున్నారని, మహిళా సంఘాల పనులే కాకుండా ప్రభుత్వం చేపడుతున్న అన్నిరకాల సంక్షేమ పథకాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర వచ్చి 10 ఏళ్ళు దాటినా వీఓఏల బ్రతుకులు మారలేదని, వీఓఏలకు సెర్ప్ నుండి కేవలం రూ.5వేల గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. గ్రామ సంఘం పుస్తక నిర్వహణ కొరకు ఎంపిక చేసిన వీఓఏలకు నేడు అనేకరకాల పనులు చేయిస్తున్నారని, ఎంతో మంది వీఓఏలు ప్రభుత్వం ఇస్తున్న అతి తక్కువ గౌరవ వేతనంతో కుటుంబాలు గడవక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విఓఏలు అనారోగ్యంతో, ప్రమాదాల వలన మరణిస్తున్నా కనీస బీమా సౌకర్యం లేక వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వాపోయారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించి ప్రతి వీఓఏకు రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం, కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ప్రతినెలా రెగ్యులర్ వేతనాలు వ్యక్తిగత ఖాతాల ద్వారా ఇవ్వాలని, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా చెల్లించాలని, స్త్రీనిధి ఇన్సెంటివ్ పెంచి ఇవ్వాలని, అర్హులైన వారికి సీసీలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. సెర్ప్ నుంచి రూ.5వేలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల నుంచి రూ.3వేలు తీసుకోవాలని నిర్ణయించారు. కానీ గ్రామ సంఘాలకు ఆదాయం లేక అమలు కావడంలేదని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుంటల కుమార్, దుర్గం రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి వెంకటేష్, కోశాధికారి పొట్ట పోషం, సమ్మన్న, లక్ష్మణ్, భీమరాజ్, వెంకటి, మహేష్, తుకారం, లక్ష్మీనారాయణ, రజిత, భాగ్య, లావణ్య, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న కన్వేయన్స్ డ్రైవర్ల వేతనాల సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, లేని యెడల సమ్మె చేపడతామని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం సింగరేణి అధికారులకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కన్వేయన్స్ డ్రైవర్ల పరిస్థితులు మరి అధ్వానంగా ఉన్నాయని, కనీసం డ్రైవర్లకు రావాల్సిన వేతనాలనే కార్మికులు పొందలేని దుస్థితి నెలకొందని అన్నారు. కానీ ఇప్పుడు సింగరేణి యాజమాన్యం కన్వేయన్స్ డ్రైవర్లకు కూడా సీఎంపీఎఫ్ అమలు చేయాలని సర్క్యులర్ ఇచ్చిందని, సీఎంపిఎఫ్ కటింగ్ చేస్తున్నాం కాబట్టి మీకు ఇచ్చే వేతనాన్ని కూడా తగ్గిస్తామంటూ ఓనర్లు కార్మికులను భయాందోళనలకు గురి చేస్తున్నారన్నారు. అరకొర జీతాలతో కుటుంబాలను వెల్లదీస్తున్న డ్రైవర్లను ఓనర్లు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సింగరేణి అధికారులు కాంట్రాక్టర్ బిల్లు నుండే కార్మికుని వేతనాలను చెల్లిస్తే కాంట్రాక్టు కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, పైగా మేనేజ్మెంట్ కార్మికులకు వేతనాలు చెల్లిస్తే దాదాపుగా రూ.50 లక్షలకు పైగా ప్రతినెల మిగులుతుందన్నారు. సింగరేణి అధికారులు కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించే విధంగా చొరవ చూపించాలని లేకుంటే సెప్టెంబర్ 11 తర్వాత నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు.

వార్షిక క్రీడా పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి వార్షిక క్రీడా పోటీలను ప్రగతి స్టేడియంలో బుధవారం ఇన్‌చార్జి ఏరియా జీఎం టి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ క్రీడలు అనేవి శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని, యాజమాన్యం ఖర్చుకు వెనుకాడకుండా అన్ని ఏరియాల ఉద్యోగ క్రీడలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఉద్యోగులు తమ తమ పనులను నిర్వహిస్తూనే క్రీడలలో ఆసక్తి చూపడం చాలా సంతోషకరమైన విషయమని, బుధవారం వాలీబాల్ పోటీలలో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులు చాలామంది యువకులు ఉన్నారని, క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన ప్రదర్శించాలని కోరారు. శ్రీరాంపూర్ ఏరియా క్రీడాకారులు ఏరియా లెవల్‌లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి, కంపెనీ లెవెల్‌లో, కోల్ ఇండియా లెవెల్‌లో కూడా అత్యుత్తమ ప్రదర్శన ప్రదర్శించాలని కోరారు. ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ టి శ్రీనివాస్ వాలీబాల్ క్రీడాకారులతో పాటు ఆటలలో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. బుధవారం జరిగిన వాలీబాల్ పోటీలలో మొదటి స్థానం ఆర్కె-7 గ్రూప్ జట్టు, రెండవ స్థానం ఎస్ఆర్పీ గ్రూప్ జట్టు నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్, డీజీఎం(పర్సనల్) పి అరవింద రావు, స్పోర్ట్స్ హానరరీ సెక్రటరీ పాల్ సృజన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నర్సయ్య, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్, వాలీబాల్ కెప్టెన్ కె చిన్నన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-జైపూర్



ప్రభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యాబోధన అందించడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కోటపల్లి మండలం సర్వాయిపేట్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఆకస్మికంగా ఆయన సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సకల వసతులు కల్పించేందుకు ప్రభుత్వం పటిష్ట మైన చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులు, మధ్యాహ్న భోజనం పంపిణీ, విద్యార్థుల విద్యా ప్రమాణాల సామర్థ్యం విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కాగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన కొనసాగాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించి ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజలకు సద్భావన కలిగే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం యేసన్వాయి, ఎడగట్ట గ్రామాలను సందర్శించి పారిశుధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మురుగనీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామపంచాయతీలలో చెత్త చెదారం నిలువ కాకుండా ఎప్పటికప్పుడు డంప్‌యార్డులకు తరలించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పట్ల గ్రామీణులను అప్రమత్తం చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

పీఓడబ్ల్యూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని



నవతెలంగాణ-నస్పూర్

ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) రాష్ట్ర 7వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం జ్యోతి కోరారు. బుధవారం శ్రీరాంపూర్‌లో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 31, సెప్టెంబర్ 1, 2 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాసభలకు మహిళలందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన ప్రయోజనం లేకుండా పోతుందని, ప్రభుత్వాలు అక్రమ దారులకు అండదండలు అందిస్తున్నారన్నారు. ఎక్కువ శాతం దళిత గిరిజన, బడుగు, బలహీన, వర్గాల మహిళలపై వేధింపులు జరుగుతున్నాయని, పరిశ్రమల్లో పనిచేసే మహిళలపైన వేధింపులు జరుగుతున్నాయన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) మహిళలపై నిత్యం జరుగుతున్న వేధింపులకు వ్యతిరేకంగా, అత్యాచారాలకు, అన్యాయాలకు వ్యతిరేకంగా, పనికి సమాన వేతనంకు పోరాటాలు చేస్తుందని అన్నారు. ఈ మహాసభలు గత పోరాటాలను సమీక్షించుకొని నూతన పోరాటాలకు కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిరీష, శారద, కవిత, లక్ష్మి మల్లేశ్వరి, కమలమ్మ విజయ, స్వప్న పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కల్వర్టులు, డివైడర్లకు రేడియం స్టిక్కర్స్



నవతెలంగాణ-మందమర్రి

రాత్రివేళ మూల మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు కల్వర్టులు డివైడర్‌లకు రేడియం స్టిక్కర్లను అంటిస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. బుధవారం ప్రమాదాల నివారణలో భాగంగా ఎస్ఐ రాజశేఖర్ ఆదేశాల మేరకు పెట్రోల్ కార్ సిబ్బంది ఏఎస్ఐ భగవత్ ఆధ్వర్యంలో హోంగార్డ్ శ్రావణ్ కుమార్, ప్రధాన రహదారి వెంట మూల మలుపుల వద్ద ఉన్న కల్వర్టులకు రేడియం స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ రాత్రి వేళలో ప్రధాన రహదారి పక్కన గల కల్వర్టులు డివైడర్లకు చెట్లకు గుద్దుకొని తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. లైట్ ఫోకస్‌కి రేడియం స్టిక్కర్లు మెరుస్తుండడం వల్ల ప్రమాదాన్ని వాహనదారుడు గుర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు.

జడ్‌పీహెచ్ఎస్ విద్యార్థులకు భోజనం



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లా రెడ్డి మహిళ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హై స్కూల్ నస్పూర్ పాఠశాలలో బుధవారం విద్యార్థినిలకు అవసరమైన మధ్యాహ్న భోజన స్టీల్ ప్లేట్స్(150 మందికి) సేవా కార్యక్రమంలో భాగంగా అందజేసినట్లు రెడ్డి మహిళా జిల్లా అధ్యక్షురాలు గోనే మని మాల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి మా సంస్థ ద్వారా వివిధ ప్రాంతాలలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, దీనికి మా కమిటీ సభ్యులందరూ సహాయ సహకారం అందజేస్తున్నరన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ అధ్యక్షురాలు స్వాతిరెడ్డి, కార్యదర్శి రేణుక రెడ్డి, కోశాధికారి లీలారెడ్డి, ఉపాధ్యక్షులు రాణిరెడ్డి, ప్రియారెడ్డి, ఈసీ మెంబర్ పద్మారెడ్డి పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం.. విజృంభిస్తున్న జ్వరాలు



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని నర్సింగాపూర్ పారిశుధ్య పనులు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీలు చెత్తాచెదారంతో కూరుకు పోయి దోమలు ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా గ్రామంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన పండుగ మైసయ్య, ఆరెందల రాజయ్య, కుక్కల లక్ష్మి, తోకల జగ్గయ్య, శ్రీవల్లి తదితరులు గత నాలుగు రోజులుగా జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామపంచాయతీలో డ్రైనేజీలను శుభ్రం చేసి మురికి నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు..కాగా గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు నిరంతరంగా కొనసాగేలా చర్యలు తీసుకోవడంతో పాటు రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు చేపడతామని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాబురావు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఆదిలాబాద్
గురువారం | ఆగస్టు 29, 2024 | www.navatelangana.com

సూపర్ లగ్జరీ బస్సుకు తప్పిన ప్రమాదం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. డిపో మేనేజర్ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు వస్తుండగా సిద్దిపేట సమీపంలో ద్విచక్ర వాహనదారున్ని తప్పించబోయి డివైడర్‌ను ఢీ కొట్టింది. బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులెవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఫిట్స్‌తో కుంటలో పడి మహిళ మృతి

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలం కేంద్రంలోని బంటు రుకుంబాయి(50) మహిళా నీటి కుంటలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ ఇస్లావత్ నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కూలీ పనికి వెళ్లే క్రమంలో కస్తూరిబా హాస్టల్ వెనుకాల ఉన్న ఉల్లాజి వ్యవసాయ కుంట మీదుగా నడుచుకుంటూ వెళ్తుండగా, ఒకేసారి ఫిట్స్ రావడంతో నీటి కుంటలో పడి మృతి చెందింది. మృతురాలి భర్త బంటు చంద్రయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేదరికంలో వికసించిన విద్యా కుసుమం

● మిషన్ భగీరథ ఎఈఈగా ఎంపికైన ప్రశాంత్

నవతెలంగాణ-ముథోల్



మండలంలోని కారేగాం గ్రామంలో పేద కుటుంబంలో జన్మించి, కష్టపడి చదివి మిషన్ భగీరథ పథకంలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తల్లి బీడీలు చూడుతూ తండ్రి మత్స్యకారుడుగా, రైతుగా పని చేస్తూ కొడుకుని చదివించాడు. ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికయ్యే విధంగా ప్రోత్సహించారు. దీంతో ఇటీవల మిషన్ భగీరథ ఏఈఈగా ప్రశాంత్ కూమార్ ఉద్యోగాన్ని సంపాదించాడు. కారేగాం గ్రామానికి చెందిన లక్ష్మి రాముల కుమారుడైన ప్రశాంత్ కుమార్ పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించాడు. ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్‌లోని ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ విద్యనభ్యసించాడు. అనంతరం వరంగల్లోని కాకతీయ యూనివర్సిటీలో బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు. అనంతరం ఎంటెక్ కూడా పూర్తి చేశారు. వివిధ పోటీ పరీక్షల కోసం ప్రిపేర్ అయ్యాడు. కొడుకు చదువు కోసం తల్లి బీడీలు చూడుతూ తండ్రి మత్స్యకారుడుగా పనిచేసి కొడుకును ప్రోత్సహించారు. దీంతో విద్యార్థి ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయి టీజీపీఎస్సీ విడుదల చేసిన సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో మీషన్ భగీరథ పథకంలో ఎఈఈగా ఎంపికయ్యాడు. దీంతో ఏఈఈగా ఎంపికై గ్రామానికి పేరు తెచ్చిన ప్రశాంత్ కుమార్‌ను గ్రామస్తులు, పలువురు నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్ బుధవారం నవతెలంగాణతో మాట్లాడారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకుంటూ, బాబాయ్ శ్రీనివాస్ ప్రోత్సాహంతో కష్టపడి చదివి, ఉద్యోగాన్ని సంపాదించానని తెలిపారు. తనకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు సహకారం మరువలేనిదన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ఇన్‌చార్జి డాక్టర్ సుంకన్న అందుబాటులో లేక కనీసం ఒక్క పేషెంట్ కూడా ఉండక పోవడంతో పూర్తి వివరాలు డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాంను అడిగారు. సరైన రికార్డ్ లేక పోవడంతో అన్ని రికార్డులు మెయింటెయిన్ చేయాలని, స్టాఫ్ నర్స్‌లు నియమించేందుకు డీఎంహెచ్ఓకు మాట్లాడతానని చెప్పారు. పాత పీహెచ్‌సీ బిల్డింగ్ స్థలం ఆక్రమణ జరగకుండా ఫెన్సింగ్‌తో పాటు మార్కెట్ కోసం ప్రపోజల్ ఇవ్వాలని ఆదేశించారు. ఆయనతో పాటు వైద్యులు అజ్మీరా రాజ్ కుమార్, ఎంపీడీఓ కోట ప్రసాద్, గ్రామ కార్యదర్శి సాయి కష్ణ, విజయ్ ఉన్నారు.

కొట్నాక భీంరావు వర్ధంతిని జయప్రదం చేయాలి

● మాజీ ఎంపీపీ పెందూర్ మోతీరాం



నవతెలంగాణ-కెరమెరి

జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించ తల పెట్టిన, దివంగత మాజీ గిరిజన శాఖ మంత్రి కోట్నాక భీంరావు వర్ధంతిని జయప్రదం చేయాలని మాజీ ఎంపీపీ పెందూర్ మోతీరాం అన్నారు. బుధవారం మండలంలోని హట్టి గ్రామంలో వర్ధంతికి సంభందించిన గోడ ప్రతులను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఆదివాసీల ప్రజల అభివృద్ధికి భీంరావు ఎంతో కృషి చేశారని అన్నారు. ఉమ్మడి జిల్లాలో నే మొట్టమొదటి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా జిల్లా ప్రజలకు సేవాలందించారని ఆయన సేవలను కొనియాడారు. వర్ధంతికి జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు, కో ట్నాక అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఝరి మాజీ సర్పంచ్ కుంరం నాణేశ్వర్, ఆత్రం కుసుంరావు, మడావి భరత్ భూషణ్, తొడసం జగనాథ్, పెందోర్ జల్పత్, కుద్మేత సోము, సోనేరావు పాల్గొన్నారు.

రేషన్ కార్డు లేని రైతుల కుటుంబాల వివరాలు సేకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని రామాయి గ్రామంలో రుణమాఫీ పథకంలో రేషన్‌కార్డు లేని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ నోడల్ ఆఫీసర్ మండల వ్యవసాయాధికారి కాటిపెల్లి నగేష్‌రెడ్డి, చేయడం జరిగిందన్నారు. స్థానిక ఏఈఓలు శివ, మహేష్, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని చించాల గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ కవిత విడుదలైన సందర్భంగా బుధవారం రాత్రి సంబరాలు చేసుకున్నారు. అలాగే స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. చివరకు న్యాయమే గెలుస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ యువజన అధ్యక్షుడు పెండ్యాల లక్ష్మణ్, అంజయ్య, సక్కరి శ్రీకాంత్, పెక్కంటి అంజయ్య, తునుకుల శ్రావణ్, అరుణ్, పెక్కంటి రాజు, ప్రసాద్, బైరోళ్ల సునాయ్, దిలీప్ పాల్గొన్నారు.

ఐకేపీ విఓఏల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్
● జిల్లా కేంద్రంలో ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. మగళవారం తమ డిమాండ్లు పరిష్కరించాలని వీఓఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పీడీ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మూడు నెలల రెన్యువల్ పద్ధతిని రద్దు చేయడంతో పాటు జీఓ నెంబర్ 58ని సవరించాలన్నారు. అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతి కల్పించాలన్నారు. గతంలో సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం హామీ ఇచ్చిందని వాటిని వెంటనే అమలు చేయాలన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాల అయినప్పటికీ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు కృషి చేయకపోవడం దారుణం అన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైన ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. వీఓఏల ధర్నాకు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టీకానంద్, కార్తీక్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమా, జ్యోతి, జిల్లా నాయకులు కుటికెల ఆనంద్, ఫయిమా, బుద్దు, స్వప్న, జయంత్, సతీష్, సంతోష్, సుజాత, సంతోష్, ఆనంద్ రవి, తిరుపతి, రోజా వనిత స్వప్న భారత్, రవీందర్, హనుమంతరావు, ధనరాజ్ అంకన్న పాల్గొన్నారు.

జ్వరాల నియంత్రణ చర్యలు చేపట్టండి

● చెన్నూర్ ఆసుపత్రిలో జ్వర పీడితులను పరామర్శించిన కలెక్టర్



నవతెలంగాణ-జైపూర్

విష జ్వరాలు విజృంభిస్తున్న వేళ నియంత్రణ చర్యలతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం చెన్నూరు పట్టణంలో గల వంద పడకల ఆసుపత్రి సందర్శించి ఆస్పత్రి పరిసరాలు, వార్డులు పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. విష జ్వరాల నియంత్రణకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని, విధుల పట్ల సమయపాలన పాటించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామీణులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. అదేవిధంగా కాచి వడబోసిన నీటిని తాగాలని, ఆహారం వేడిగా ఉన్నప్పుడే భుజించాలని తెలిపారు. అదేవిధంగా వ్యాధుల వ్యాప్తిని నివారించడం కోసం గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. జ్వర పీడితుల నుండి రక్త, మల, మూత్రాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలని, వ్యాధి నిర్ధారణ తర్వాత అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

క్రమబద్దీకరణ హామీ నిలబెట్టుకోవాలి

● కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని అసంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో ఉద్యోగులు మహా ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే రెగ్యులరైజ్ చేస్తామని బేసిక్ పే అమలు చేస్తామని, సీఎం హామీ ఇచ్చి, ఇప్పుడు తప్సారం చేస్తున్నారని ఆరోపించారు. గత కొన్ని నెలలుగా ముఖ్యమంత్రితో సహా మంత్రులను అనేకసార్లు కలిసిన తమ సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో ఆందోళన చేపడుతున్నామన్నారు. తమను రెగ్యులరైజ్ చేసే వరకు దశలవారీగా ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రకాష్, పార్థసారథి, వెంకటి, కవిత, మమత, దేవదర్శన్, ప్రవీణ్, సోమన్న, ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక...

దీక్షానంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షులుగా భోజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చందు, ప్రధాన కార్యదర్శిగా కవిత, కోశాధికారిగా కేశవ్, అధికార ప్రతినిధిగా సోమన్న, ఉపాధ్యక్షులుగా ప్రదీప్, భరత్, దర్శన్, అనిల్, రాకేష్, మహిళా అధ్యక్షులుగా మమత, రత్నతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

● ఐసీయూ వార్డు రూ.12లక్షల సామాగ్రి అందజేత



నవతెలంగాణ-భైంసా

ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆయన నివాసంలో బీజేపీ నాయకుల, కార్యకర్తల ప్రజల సందడి నెలకొంది. మొదటిసారిగా ఎమ్మెల్యే హోదాలో జన్మదిన జరుపుకుంటున్న సందర్భంగా పెద్ద మొత్తంలో అభిమానులు వచ్చి ఎమ్మెల్యేకు శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్యే అభిమానుల మెగా రక్త దాన శిబిరం..

ఎమ్మెల్యే రామారావు పటేల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన అభిమానులు భారీ సంఖ్యలో రక్తదానం చేశారు. ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన మెగా రక్త శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 103మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానంలో మహిళలు సైతం ముందుకు వచ్చారు. రక్త దాతలను ఎమ్మెల్యే పటేల్ అభినందించారు.

ఐసీయూ వార్డు కోసం సామాగ్రి అందజేత..

ఎమ్మెల్యే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రిలో ఐసీయూ వార్డులో ఇతర సామాగ్రి కోసం రూ.12లక్షల 10 ఐసీయూ బెడ్స్, 15 జనరల్ బెడ్స్, 10 మల్టీ పారామిటర్స్, 10 బెడ్ సైడ్ లాకర్స్, వీల్‌చైర్, స్ట్రెక్చర్, 30 మంది అవుట్ పేషంట్స్ కోసం కూర్చునే సీట్లను అందించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో పాటు ఆయన కుమారులు డాక్టర్ సతీష్ పవార్, సందీప్ పవార్, సోదరుడు దత్తురామ్ పటేల్‌తో పాటు కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

గిరివికాసం పథకం పనులను పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన రైతుల భూములకు గిరివికాసం పథకం ద్వారా బోరుబావులకు త్రిఫెజ్ విద్యుత్ కనెక్షన్లు, మోటార్లు పైప్ లైన్లు పనులను వెంటనే పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అన్నారు. బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్ విద్యుత్‌శాఖ, డీఆర్డీఓ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ అటవీశాఖ నుంచి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరంగా జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంత్‌రావు, ఎస్ఓ సురేష్, గిరివికాసం కోఆర్డినేటర్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా శక్తి క్యాంటీన్ పనులను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మహిళశక్తి క్యాంటీన్ పనులను బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు 12 రకాల సహకారాలను అందించడం జరుగుతుందని అన్నారు. బ్యాంక్ రుణం రూ.3లక్షల 10 వేలు వచ్చాయని, నాణ్యమైన ఆహారాన్ని అందించి, లబ్ధి పొందాలని సూచించారు. నిధులకు సంబంధించి ఇప్పటి వరకు ఎంత ఖర్చు చేశారు. ఏమేమి వస్తువులు కొన్నారు. మిగితా హోటల్స్‌కి మీరూ ఏర్పాటు చేసే క్యాంటీన్‌కు తేడా ఏంటని అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాల్లో రాజీ పడొద్దని, మంచి ఆహారాన్ని అందించాలని అన్నారు. అలాగే క్యాంటీన్‌లో ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్, వాడకూడదని, క్లాత్ కవర్స్ ఉపయోగించాలని, రేట్ చార్ట్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పొచ్చర జలపాతం వద్ద ఏర్పాటు చేయనున్న ఇందిరా మహిళా శక్తి పథకం కింద క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించి, పలు సూచనలు, సలహాలు చేశారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, డీఆర్డీఓ సాయన్న పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చూడాలి

నవతెలంగాణ-నార్నూర్

పారిశుధ్యం లోపించకుండా చూడాలని ఏజెన్సీ డీఎంహెచ్ఓ కుడ్మేత మనోహర్ సూచించారు. బుధవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించి, ఆయా రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని వార్డుల్లో తిరుగుతూ మురుగు కాలువలు, బావులు పరిశీలించారు. బావుల్లో కాలువల్లో ఎప్పటి కప్పుడు సానిటేషన్, క్లోరినేషన్ చేయాలని, వైద్య సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాని ప్రతి మంగళవారం శుక్రవారం డ్రైడే నిర్వహించాలని సూచించారు. పారిశుధ్య పనుల్లో వేగం పెంచాలని కోరారు. వారి వెంట డాక్టర్ రాంబాబు, హెచ్ఈఓ నాందేవ్, వైద్య సిబ్బంది సింధు, కైలాస్, ఈశ్వర్, జవహర్ లాల్, ఆశా శ్రీలత ఉన్నారు.

నేడు అడెల్లి పోచమ్మ ఆలయంలో వేలం నిర్వహణ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ అడెల్లి మహా పోచమ్మ ఆలయంలో గురువారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఇన్‌చార్జ్ కార్యనిర్వాహణ అధికారి బి. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇతరములు, పూలదండలు అమ్ముకునే హక్కు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకోను హక్కుకు గాను, సంవత్సర కాల పరిమితికి గాను, బహిరంగ వేలం ఉదయం 11గంటల నుంచి నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలవారు సకాలంలో వచ్చి పాల్గొనాల్సిందిగా తెలియజేశారు.

పెన్షన్ విద్రోహ దినం విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సెప్టెంబర్ 1న నిర్వహించే పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. దీని కోసం రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ నాయకులు రాజశేఖర్, మేడి చరణ్‌దాస్, ఏటుకూరి శ్రీనివాసరావు, శాంతికుమారి, వైద్య శాంతికూమారి, జాడి కేశవ్, ఖమర్, భాజీఖాన్, అనురాధబాయి, సుజాత పాల్గొన్నారు.

ముధోల్ సీఐకి ఘన సన్మానం

నవతెలంగాణ-ముథోల్

ముథోల్ సీఐ మల్లేష్‌కు ఇటీవల ఉత్తమ అవార్డు వచ్చిన సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ముథోల్ పోలిస్ స్టేషన్‌లో సీఐని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ మాట్లాడుతూ సీఐ చేసిన కృషికి రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15న ఉత్తమ అవార్డు అందజేయడం సంతోషకరమని అన్నారు. రానున్న కాలంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం మరింత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం ఆరిఫ్ హైమద్, సామాజిక కార్యకర్త వినోద్, హ్యూమన్ రైట్స్ నిర్మల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ హుజూర్, అక్బర్ అలీ, నగేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను వేగవంతం చేయాలి

● జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-తాండూర్

పంచాయతీలో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం తాండూర్ మండలంలోని అచలాపూర్, తాండూర్ గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సరీలను పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఎన్నికల నిర్వహణ పనులను గురించి కార్యదర్శి కల్పనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల అనంతరం నాలాల్లో కూరుకుపోయిన బురదను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. దోమల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అందుకు గాను తరచు ఆరోగ్య కమిటీలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ, అనిల్ కుమార్, తాండూర్ పంచాయతీ కార్యదర్శి దివాకర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.